క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన శంకర్ నాయక్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వడిత్యా శంకర్ నాయక్, గిరిజనులు

ఏలూరు(మెట్రో) : ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ శనివారం ఏలూరు కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పెదపాడు గ్రామంలో ఎస్టీల ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారని వివరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ పీఎస్ శ్రీనివాసనాయుడు, ఏలూరు అర్బన్ తహసీల్దారు జీవీ శేషగిరి ఉన్నారు.

సీడీపీఓ తనిఖీ



స్టాక్ పాయింట్లను తనిఖీ చేస్తున్న సీడీపీఓ

ఏలూరు (టూటౌన్): ఏలూరు ప్రాజెక్ట్ సీడీపీఓ ఎ.పద్మావతి స్టాక్ పాయింట్లను తనిఖీ చేశారని ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి తెలిపారు. శనివారం ఆయా స్టాక్ పాయింట్లలో బియ్యం, పప్పు, నూనెలను పరిశీలించారని పేర్కొన్నారు. రేషన్ షాపులకు, అంగన్‌వాడీ సెంటర్లకు పప్పు సరఫరా చేశామని వివరించారు.

94.44 శాతం పింఛన్ల పంపిణీ

ఏలూరు(మెట్రో): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తొలిరోజు శనివారం రాత్రి 7 గంటల సమయానికి 94.44 శాతం పూర్తి చేశామని అధికారులు తెలిపారు. ఏలూరు జిల్లాలో 2,61,454 మంది లబ్ధిదారుల్లో 2,46,924 మందికి (94.44 శాతం) రూ.106.55 కోట్లు అందజేశామని పేర్కొన్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో మూడో తేదీ సాయంత్రంలోగా మిగిలిన వారందరికీ పింఛన్లు అందిస్తామని వివరించారు.

మంద కృష్ణకు అవార్డు గర్వకారణం

ఏలూరు (టూటౌన్): మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం గర్వకారణమని మదర్ థెరిస్సా రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అయినపర్తి మాధవరావు పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం స్థానిక నరసింహారావు పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సంఘ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.

స్నేహాంజలి.. యువతకు స్ఫూర్తి

- స్నేహితులకు అంజలి ఘటిస్తూ..
- 12 ఏళ్లుగా సేవ, క్రీడా పోటీలతో నివాళి
- 5 వేల మందితో రక్తదాన గ్రూపు
- ఏలూరు యువత సేవలకు అభినందనలు

ఏలూరు టౌన్: స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అంటూ ఒక సినీకవి స్నేహానికున్న బంధాన్ని చక్కగా పాట రాశారు. ఏలూరులోని యువత స్నేహితులపై తమకున్న ప్రేమ, అభిమానాన్ని చాటుకుంటూ ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో అంజలి ఘటిస్తారు. ఏలూరు నగరంలోని ఎనిమిది స్నేహితులు చేయిచేయీ కలిపి స్నేహాంజలి ఆర్గనైజేషన్‌ను స్థాపించారు. ఈ పేరుతో తమతో సరదాగా గడిపే స్నేహితులు ప్రమాదమో లేదా అనారోగ్యమో ఏదైనా కారణంతో మృతిచెందితే, వారి పేరుతో సేవా కార్యక్రమాలు, క్రీడాపోటీలు నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

స్నేహానికి నిలువెత్తు నిదర్శనం

ఏలూరు నగరానికి చెందిన యువత 12 ఏళ్ల క్రితం ప్రారంభించిన స్నేహాంజలి దశాబ్దకాలానికి పైగా వివిధ సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఏలూరు నగరంలో మృతిచెందిన తమ స్నేహితులు 32 మందికి ఇప్పటి వరకు స్నేహాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులు, బంధువులు వారిని గుర్తు చేసుకున్నా.. లేకున్నా స్నేహాంజలి మాత్రం స్నేహానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. ఇక ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల పరిధిలో ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో భారీ ఎత్తున క్రికెట్ పోటీలు ప్రతి ఏటా ఫిబ్రవరిలో నిర్వహిస్తుంది. ఐదు వేల మందితో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తూ శభాష్ అనిపించుకుంటోంది. క్రీడల్లో ప్రతిభ చూపించే యువతకు సత్కారం, నగదు ప్రోత్సాహం అందిస్తుంది. స్నేహితులను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా భారీ అన్నదానం చేస్తుంది. గత ఏడాది ఫిబ్రవరిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి, విజేతలకు వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేయించింది. ఈ స్నేహాంజలిలో ప్రధానంగా ఉల్లింగుల చందు, జి.రెడ్డి, పట్టా మహేష్, ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ చైర్మన్ సారెల్లా సతీష్, ఫొటోగ్రాఫర్ భాస్కర్, కాదులూరి సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.



స్నేహాంజలి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలతో వైఎస్సార్ సీపీ పార్లమెంట్ సమన్వయకర్త సునీల్‌కుమార్, యూత్ (ఫైల్)



గత ఏడాది క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారుల (ఫైల్)



మృతులు 32 మంది యువతకు నివాళి ఫెక్సీ (ఫైల్)

స్నేహితులను గుర్తుచేసుకుంటాం



ఏలూరు నగరంలో చిన్ననాటి నుంచీ సరదాగా తిరిగే స్నేహితులు మరణించినప్పుడు మనసు కలచివేస్తుంది. వారితో గడిపిన క్షణాలు ఎప్పుడూ గుర్తుకు వస్తూ ఉంటాయి. ఆ కుటుంబ సభ్యుల బాధ వర్ణణాతీతంగా ఉంటుంది. మా స్నేహితులకు గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నాం. సుమారుగా 60 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయి. మృతిచెందిన స్నేహితుల జ్ఞాపకార్థం అన్నదానం చేస్తాం.

– భాస్కర్, స్నేహాంజలి ఆర్గనైజర్, ఏలూరు

స్ఫూర్తిగా నిలిచేందుకే..



నేడు ఎంతోమంది యువత అనేక కారణాలతో మృతిచెందుతున్నారు. మా స్నేహితులు ఆకస్మికంగా మరణిస్తే, తీవ్ర మానసిక వేదనకు గురయ్యాం. ప్రతి సంవత్సరం మా స్నేహితులకు అంజలి ఘటించాలనే ఉద్దేశంతో స్నేహాంజలి ఏర్పాటు చేశాం. సామాజిక సేవలో భాగంగా ఐదు వేల మందితో గ్రూప్ ఏర్పాటు చేసి రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నాం. సమాజంలో ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

– గురువిల్లి గంగాధర్‌రెడ్డి, స్నేహాంజలి ఆర్గనైజర్, ఏలూరు

పెళ్లి పేరుతో నమ్మించి, మోసం చేశాడని ఫిర్యాదు

ఏలూరు టౌన్: తనతో పరిచయం పెంచుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, సహజీవనం కొనసాగిస్తూ తన బంధువుల వద్ద లక్షలాది రూపాయలు అప్పు తీసుకుని మోసగించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన వివాహిత (37) భర్త రోడ్డు ప్రమాదంలో మరణించగా ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె మ్యారేజి ఈవెంట్స్ చేస్తూ తన బిడ్డను పోషించుకుంటున్నారు. ఒక మహిళ ద్వారా ఏలూరులోని బీడీ కాలనీకి చెందిన మహ్మద్ అస్లాం (40) పరిచయమయ్యాడు. ఆ పరిచయంతో ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ.. ఆమె బంధువుల వద్ద నుంచి రూ.10 లక్షల అప్పుగా తీసుకుని, ఆ మహిళతో సంతకాలు పెట్టించాడు. ఎంతకీ సొమ్ములు కట్టకపోవడం, ఆమెను పెళ్లి చేసుకోకపోవడంపై బాధితురాలు శనివారం పోలీసులను ఆశ్రయించింది. దీంతో మహ్మద్ అస్లాంపై టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీకి యత్నం

ఏలూరు టౌన్: ఏలూరు టూ టౌన్ పరిధిలో దొంగలు ఒక ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడవేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతం బూడిద అప్పన్నస్వామి వీధికి చెందిన కట్టు నాగఫణి తన ఇంటికి తాళం వేసి ఊరెళ్లాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో శనివారం ఉదయం పక్కింటి వారు ఆయనకు ఫోన్ చేసి విషయం తెలిపారు. ఈ ఘటనపై నాగఫణి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రంలో ఉన్న కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ జరిగి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. మే నెల 21వ తేదీ వరకు 108 రోజుల పాటు ఈ యజ్ఞం కొనసాగించనున్నారు. తొలిరోజు ఉదయం కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం, గంధసింధూర, తమలపాకు పూజలు చేశారు. అనంతరం సహస్ర నామ పారాయణ చేసి స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మధ్యాహ్నం హనుమాన్ చాలీసా పారాయణ చేసి ఆంజనేయ మూలమంత్ర హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. అర్చకులు కిషోర్ విశేష పూజలు నిర్వహించగా, క్షేత్రం వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

హాస్టల్ విద్యార్థిని అదృశ్యం

ఏలూరు టౌన్: హాస్టల్ నుంచి ఒక విద్యార్థిని అదృశ్యమైందని ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. బుట్టాయిగూడెం మండలంలోని ఒక గ్రామానికి చెందిన విద్యార్థిని (19) ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఇంటర్మీడియట్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతూ ఆ కాలేజీ హాస్టల్లోనే ఉంటుంది. శనివారం మధ్యాహ్నం 3.15 గంటలకు విద్యార్థిని తరగతి గది నుంచి హాస్టల్ రూముకు వెళ్లి యూనిఫాం తీసి సివిల్ డ్రస్ వేసుకుని బయటకు వెళ్లినట్టు గుర్తించారు. ఆమె కోసం వెతికినప్పటికీ అచూకీ కానరాక పోవడంతో హాస్టల్ వార్డెన్ ఆ విద్యార్థిని తల్లికి సమాచారం ఇచ్చారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విద్యార్థిని అదృశ్యం కేసు దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే

- దెందులూరు నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతున్న సర్వే
- ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

పెదపాడు: కుష్టు వ్యాధి ఒక ప్రాణాంతకమైన అంటువ్యాధిగా గతంలో భావించేవారు. ఈ వ్యాధిన పడిన వారిని ఊరుబయట ఉంచేవారు. వ్యాధిగ్రస్తుల వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే ఇష్టపడేవారు కాదు. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో ప్రస్తుతం రోగులు అందరితో సాధారణ జీవితంతో గడుపుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మందులు వాడుతూ వ్యాధిని నయం చేసుకుంటున్నారు. తద్వారా అంగవైకల్యం రాకుండా చేసుకుంటున్నారు. 15 ఏళ్ల క్రితమే ఈ వ్యాధి అంతం కావాల్సి ఉండగా ఏటా అక్కడక్కడ కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో చేపట్టిన కుష్టు వ్యాధి లక్షణాల గుర్తింపు సర్వే చురుగ్గా సాగుతోంది. వచ్చే నెల 13వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగనుంది. కుష్టు వ్యాధి ఒక బ్యాక్టీరియా ద్వారా వస్తుంది. వ్యాధి లక్షణాలను సులభంగా గుర్తించవచ్చు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎండీటీ మందులను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. సకాలంలో వైద్యం అందడం వల్ల వ్యాధి పూర్తిగా నయం అవుతుంది. అంగవైకల్యం రాకుండా నివారించవచ్చు.

గత ప్రభుత్వంలో సర్వే ప్రారంభం

కుష్టువ్యాధి మహమ్మారిని సమాజం నుంచి దూరం చేయాలని లక్ష్యంతో గత ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖద్వారా ఇంటింటి సర్వే చేపట్టి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్యం అందించి ప్రాణాంతకమైన వ్యాధిగా మారకుండా తగు చర్యలు తీసుకుంది. ఈ ఏడాది కూడా వైద్యఆరోగ్య శాఖ కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వేనుకొనసాగిస్తోంది. దెందులూరు నియోజకవర్గంలో ఇంటింటా సర్వే చురుగ్గా సాగుతోంది. పాజిటివ్ కేసులు ఉంటే వెంటనే వారికి వైద్యం అందించి వ్యాధినుంచి రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు వైద్యారోగ్య శాఖ చేపట్టింది.

చర్మంపై మచ్చలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దు

వ్యాధి సోకిన వ్యక్తికి 6 నుంచి 12 మాసాల్లో వ్యాధిని నివారించవచ్చు పెదపూడి మండలంలో 23 గ్రామ పంచాయతీల్లోని పెదపాడు, వట్లూరు పీహెచ్‌సీల పరిధిలో సచివాలయాల ఏఎన్ఎంలు ఇంటింటా సర్వేలు నిర్వహిస్తున్నారు, మండలంలో 152 మంది అనుమానితులను గుర్తించి ఇతర పరీక్షలకు పంపించారు.

ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా మందుల పంపిణీ

ప్రభుత్వాసుపత్రిలో బహుళ ఔషధ చికిత్స మల్టీ డ్రగ్ థెరపీ (ఎండీటీ) ద్వారా కుష్టు వ్యాధికి మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ముందుగా వైద్యుడు వ్యాధి నిర్ధారణ చేస్తారు. ఆ తర్వాత మొదటి నెల వైద్యుని వద్ద, రెండో నెల నుంచి ఏఎన్ఎం ఆశావర్కరు ద్వారా ఇంటి వద్దే మందులు ఉచితంగా పంపిణీ చేస్తారు. వైద్యులు సూచనల మేరకు నిర్ణీత కాలానికి మందులు క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. స్పర్శ లేని మచ్చలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా స్థానికంగా ఉన్న పీహెచ్‌సీ లేదా విలేజ్ క్లినిక్‌లోని వైద్యులు చూపించాలి. అక్కడ అనుమానం వ్యక్తం చేస్తే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులకు చూపించుకోవడం చాలా ముఖ్యం.



పెదపాడులో కుష్టు వ్యాధిపై సర్వే, అవగాహన కలిగిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది



పెదపాడులో కుష్టు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

సర్వే ద్వారా ప్రజలకు అవగాహన



గతంలో కుష్టు వ్యాధి సోకిందంటే భయంతో బాధపడేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు వచ్చేనెల 13వరకు నిర్వహిస్తాం. వ్యాధి లక్షణాలున్న రోగులు భయపడకుండా సకాలంలో మందులువాడితే ఆరోగ్యంగా జీవించవచ్చు. వ్యాధిసోకిన రోగిని వారి గృహంలో ఉంటూ వైద్య సేవలు పొందవచ్చు. పాత రోగికి రెండు మాసాలుగా మందులు పంపిణీ చేస్తున్నాం. మరోకేసు కొత్తగా గుర్తించి మందులు పంపిణీ చేస్తున్నాం.

– కె.అనంతపాల్, పెదపాడు, పీహెచ్‌సీ వైద్యాధికారి

కుష్టు వ్యాధి లక్షణాలు

- చర్మంపై స్పర్శలేని మచ్చలు
- మందమైన మెరిసే జిడ్డు గల చర్మం
- చెవులపై, వీపులపై ఎదపై నొప్పిలేని బుడిపెలు కనుబొమ్మలు, కనురెప్పలు, వెంట్రుకలు రాలిపోవడం
- కనురెప్పలు మూతపడక పోవడం, ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం
- కాళ్లు చేతులు తిమ్మిర్లు కలిగి ఉండుట, పాదాల వాపు
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- తెలియకుండానే చేతులు కాళ్లలో బొబ్బలు రావడం
- చేతి, కాలువేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	14
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	23
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	01
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	07
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	09
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	06
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	15
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	22
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు - తిరుపతి	16.00	4830	34
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	14

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	24	బీర్లచిక్కుడు	52
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	30	కంద	68
కాకర కాయలు	34-40	బీట్‌రూట్	34
బీరకాయలు	38	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	46	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	07-10
దోసకాయలు	28-34	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి చర్యలు



తాళ్లగూడెంలో విద్యార్థుల నుంచి సమాచారం రాబడుతున్న జాయింట్ కలెక్టరు పి.ధాత్రిరెడ్డి

పెదపాడు : పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు పి ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. పెదపాడు మండలంలోని తాళ్లగూడెంలో శనివారం జేసీ పర్యటించి స్థానిక పాఠశాలలో తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, వర్క్‌బుక్‌లను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ, డ్రెయినేజీల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణ నిర్ణయం దుర్మార్గం

దెందులూరు: ప్రసిద్ధిగాంచిన సింహాచలం ఆలయ భూములను ఆక్రమించుకోవడం దుర్మార్గమని, రాష్ట్ర ప్రభుత్వం తప్పును సరిదిద్దకపోగా ఆక్రమించుకున్న 12 వేల మంది ఇళ్లను క్రమబద్ధీకరిస్తామని తీసుకున్న నిర్ణయం తప్పని సిటిజన్స్ రైట్స్ అండ్ రెస్పాన్సిబిలిటీ జాతీయ కన్వీనర్ చలమల సత్యనారాయణ కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలాయగూడెంలోని ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వీహెచ్‌పీ జాతీయ నాయకత్వానికి, సనాతన బోర్డుకు, బీజేపీ అధిష్టానానికి, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

సిగ్నల్ లైటు లేక ప్రమాదాలు

దెందులూరు: సోమవరప్పాడు రహదారిపై సిగ్నల్ లైటు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సెయింట్ జాన్స్ బీఈడీ కళాశాల బ్రిడ్జి వద్ద నుంచి సోమవరప్పాడు వరకు రెండు లైన్ల రోడ్డు ఉంది. డివైడర్ ప్రారంభం వద్ద గతంలో సిగ్నల్ లైట్ స్తంభం ఉండేది. రోడ్డు డివైడర్ నిర్మాణం అనంతరం స్తంభం సిగ్నల్ లైట్ తీసివేశారు. సోమవరప్పాడు డివైడర్ వద్ద సిగ్నల్ లైట్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించిన దాతలు

గణపవరం: ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. గణపవరం మండలం సరిపల్లెకి చెందిన ప్రవాసాంధ్రులు రామ్ లక్ష్మణ్ తమ ఫౌండేషన్ ద్వారా జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. డిగ్రీ కాలేజిలో మొదటి బహుమతిగా రూ.40వేల నగదును బీఎస్సీ విద్యార్థిని యలగం హారికకు అందజేశారు. ద్వితీయ బహుమతి రూ.20వేలు బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అలేఖ్యకు, తృతీయ బహుమతి రూ.10 వేలు బీఎస్సీ ఎంపీసీ విద్యార్థిని యర్రంశెట్టి కృష్ణకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నిర్మలకుమారి మాట్లాడుతూ జీవితంలో ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా పుట్టిన గ్రామాన్ని, చదివిన విద్యాసంస్థను మరువలేమన్నారు. అమెరికాలో స్థిరపడిన రామ్, లక్ష్మణ్ సోదరులు ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి, ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించడంలోనూ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. దాతలు రామ్, లక్ష్మణ్‌లు మాట్లాడుతూ ఈప్రాంతంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ చైతన్య, అధ్యాపకులు టి.అక్కిరాజు, స్వరూపరాణి, గణేష్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
90102 23729
95055 08399
79955 66352
Office mail : tpgadvt@gmail.com